# బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి
- నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్, జడ్పీ చైర్‌పర్సన్ అరుణ
- వీర్నపల్లిలో అబివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం

వీర్నపల్లి, అక్టోబర్ 8: బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని, సంక్షేమ పథకాలే అభ్యర్థులను గెలిపిస్తాయని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు, జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. మండలకేంద్రంలో రూ.50 లక్షలతో నిర్మించనున్న అంబేద్కర్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం పల్లె ప్రకృతివనం, రూ.40లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనం, రూ.40లక్షలతో నిర్మించిన రైతు వేదిక, రూ.23లక్షలతో ప్యాక్స్ గోదాంను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జడ్పీటీసీ గుగులోత్ కళావతి, ఎంపీపీ మాలోత్ భూల, సర్పంచ్ పాటి దినకర్‌తో కలిసి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మంత్రి కేటీఆర్ సహకారంతో వీర్నపల్లిని కొత్త మండలంగా ఏర్పాటు చేసి అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామన్నారు. మారుమూల అటవీ గ్రామాలు పదేళ్ల కింద కళాహీనంగా ఉండేవని, ప్రస్తుతం ఎంత మార్పు వచ్చిందో గమనించాలన్నారు. హరితహారంలో నాటిన మొక్కలు స్వాగ తం తెలుపుతూ గ్రామాలకు కొత్త అందాన్ని తీసుకొస్తున్నాయని తెలిపారు. రానున్న ఎన్నికల్లో రామన్నను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం గృహలక్ష్మి లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను అందించారు. ఇక్కడ మాజీ ఎమ్మెల్యే ఉచ్చిడి మోహన్ రెడ్డి, ఆర్బీఎస్ మండలాధ్యక్షుడు ఎడ్ల సాగర్, ఏఎంసీ చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, సెస్ డైరెక్టర్ మాడ్గుల మల్లేశం, జడ్పీ కో–ఆప్షన్ చాంద్‌పాషా, బంజారా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుగులోత్ సురేశ్‌నాయక్, మండల కో– ఆప్షన్ ఉస్మాన్, ఏఎంసీ వైస్ చైర్మన్ భూక్యా తులసీరాం, నాయబ్ తహసీల్దార్ ఎల్సాని ప్రవీణ్‌కుమార్, సర్పంచులు జగ్మల్, జవహర్, ఎంపీటీసీ మల్లారపు అరుణ్‌కుమార్, ఉపసర్పంచ్ బోయిని రవి, నేతలు శ్రీరాం నాయక్, భాస్కర్, చంద్రం, రఫీ, రామస్వామి, నాగరాజు, అజయ్ పాల్గొన్నారు.



అంబేద్కర్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్, జడ్పీ చైర్‌పర్సన్ అరుణ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య

# 16 నుంచి రాష్ట్రస్థాయి యోగా పోటీలు

- రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్ రవీందర్ సింగ్

కొత్తపల్లి, అక్టోబర్ 8 : ఈనెల 16 నుంచి 18 వరకు కరీంనగర్‌లో రాష్ట్ర స్థాయి యోగాసన స్పోర్ట్స్ చాంపియన్ షిప్ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్, కరీంనగర్ జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షుడు సర్దార్ రవీందర్‌సింగ్ తెలిపారు. ఈ మేరకు జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాలలో ఆదివారం జిల్లా యోగాసన చాంపియన్‌షిప్ ప్రారంభ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు రాష్ట్రంలోనే యోగాకు ప్రత్యేక కేంద్రంగా పేరుగాంచిన కరీంనగర్‌లో మూడు రోజుల పాటు రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉమ్మడి పది జిల్లాల నుంచి దాదాపు 800 మంది క్రీడాకారులు అధికారులు హాజరు కానున్నట్లు చెప్పారు. ఇక్కడ ప్రతిభ కనబరిచిన వారిని జాతీయ స్థాయి యోగా పోటీల్లో పాల్గొనే తెలంగాణ జట్టును ఎంపిక చేయనున్నట్టు చెప్పారు. జిల్లా స్థాయి యోగాసనా పోటీలకు అధిక సంఖ్యలో హాజరు కావడం యోగాకు ఉన్న విశేష ఆదరణకు అర్థం పడుతున్నట్లు తెలిపారు. యోగాలో రాణించే జిల్లా క్రీడాకారులకు అన్ని రకాల ప్రోత్సాహకాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. దశాబ్దాల చరిత్ర కలిగిన యోగాలో కరీంనగర్ నుంచి జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదగడం సంతోషదాయకమని జిల్లా యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి తెలిపారు. ప్రతిభావంతులైన క్రీడాకారులు గుర్తించి ప్రోత్సహించేందుకు ప్రతియేటా జిల్లా స్థాయి యోగా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం క్రీడాకారులు ప్రదర్శించిన పలు యోగాసనాలు ఆహుతుల్ని విశేషంగా ఆకట్టుకున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 300 మంది యోగా క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా యోగా అసోసియేషన్ ఉపాధ్యక్షులు కన్న కృష్ణ, ప్రసాద్, యోగ కోచ్‌లు కిష్టయ్య, రామకృష్ణ, మల్లేశ్వరి, సాగర్, ఉదయ్‌కిరణ్, ఆనంద్ కిషోర్, ప్రియాంక, ప్రవీణ, కోటేశ్వరరావు, రాజశేఖర్, రాజమౌళి, శకుంతల, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవీందర్‌సింగ్



యోగాసనాలు వేస్తున్న క్రీడాకారులు



# ఆరు దశాబ్దాల కల సాకారం

- పెద్దంపేట, రాయదండి ఖురూజ్ కమ్మీ భూములకు మోక్షం
- ఎమ్మెల్యే చందర్ కృషితో స్వరాష్ట్రంలో తీరిన సమస్య
- యాజమాన్య హక్కు లేక నిజాం కాలం నుంచి గోసపడుతున్న ప్రజలు
- తాజాగా మంత్రి కేటీఆర్ చేతులమీదుగా హక్కు పత్రాలు
- ఆనందంలో రెండు గ్రామాల ప్రజలు

కలలో అదృష్టం తలుపు తడితేనే ఎంతో మురిసిపోతాం. మరీ, నిజ జీవితంలో ఆ కల సాకారమైతే ఎలా ఉంటుంది..అవధుల్లేని ఆనందంలో మునిగితేలుతాం.. ఇలాగే పెద్దంపేట, రాయదండి ప్రజల చిరకాల స్వప్నం నెరవేరింది. ఆరు దశాబ్దాల కల, తీవ్రంగా వేధిస్తున్న ఖురూజ్ కమ్మి భూముల సమస్యకు పరిష్కారం దొరికింది. నిజాం ప్రభుత్వం తమ ఆధీనంలోకి తీసుకొని అటు విద్యుత్ ప్లాంట్ నిర్మించక, ఇటు పరిహారం ఇవ్వకుండా వదిలేసిన సొంత భూములకు ఇన్నాళ్లూ పట్టాలు లేక, రుణాలు రాక పడుతున్న బాధలకు స్వరాష్ట్రంలో విముక్తి లభించింది. స్థానిక ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కృషితో ఇటీవలే తొలి విడుతగా 600 మందికి గోదావరిఖని వేదికగా మంత్రి కేటీఆర్ పట్టాలు అందించగా, గ్రామస్తుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. ఆ రెండు పల్లెల్లో పండుగవాతావరణం కనిపిస్తున్నది.

పెద్దపల్లి, అక్టోబర్ 8(నమస్తే తెలంగాణ)/ కోల్‌సిటీ: అంతర్గాం మండలం పెద్దంపేట్, రాయదండి గ్రామాల ఏండ్లనాటి కల నెరవేరింది. ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కృషి ఫలితం గా బీఆర్ఎస్ సర్కారు చొరవతో 768 ఎకరాల ఖురూజ్‌కమ్మీ భూములకు మోక్షం లభించింది. ఇటీవలే మంత్రి కేటీఆర్ పట్టా లు అందజేయగా, లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమవుతున్నది.

### నిజాం కాలం నుంచి సమస్య

రాయదండి, పెద్దంపేటలో 1947లో అప్పటి నిజాం ప్రభుత్వం ఆజమాబాద్ ఇండస్ట్రీస్ విద్యుత్ ప్లాంటును ఏర్పాటుకు ఆయా గ్రామాల్లోని 1018 ఎకరాల భూములను తీసుకున్నది. కానీ పరిహారం ఇవ్వలేదు. కాగా, ఈ భూములు ఖురూజ్ కమ్మి(డబ్బులు దొరకని) భూములుగా నిజాం రికార్డుల్లోకి ఎక్కాయి. అయితే, సర్వేలతోనే సరిపెట్టి విద్యుత్ ప్లాంటు నిర్మించకుండానే వదిలేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు భూములు ప్రజల ఆధీనంలోనే ఉన్నాయి. కానీ, హక్కు పత్రాలు మాత్రం వారి వద్ద లేవు. ఆ తర్వాత ఎన్నో ప్రభుత్వాలు వచ్చినా వీరి సమస్య పరిష్కారం కాలేదు. అయితే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1995లో బ్రిటీష్ పవర్ లిమిటెడ్(బీపీఎల్) పవర్ ప్లాంట్ కోసం అవసరమైన 200 ఎకరాల ఖురూజ్‌కమ్మి భూములకు ప్రభుత్వం పట్టాలు జారీ చేసింది. అప్పుడు బీపీఎల్ యాజమాన్యం భూములను తీసుకొని ఎకరాకు ₹16 వేల పరిహారం ఇచ్చింది. అయితే బీపీఎల్ భూసేకరణ సందర్భం గా ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారమే మిగతా భూములకు సంబంధించి పట్టాలివ్వాలని ఈ రెండు గ్రామాల ప్రజలు కోర్టును ఆశ్రయించగా, హక్కు కల్పించాల్సిందేనని 2013లో కోర్టు తీర్పు ఇచ్చింది. అయితే గత కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోలేదు. అప్పటి రామగుండం ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ సైతం కనీసం పట్టించుకోలేదు. 2018లో ఎన్నికల్లో సమస్యను పరిష్కరిస్తానని కోరుకంటి చందర్ హామీ ఇచ్చి, తాజాగా నెరవేర్చారు.

### బాధితుల్లో ఆనందం

ఖురూజ్‌కమ్మీ భూముల సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం గత ఆగస్టులో జీవో జారీ చేసింది. ఈ క్రమంలో అధికారులు సర్వే చేసి ప్రతిపాదనలు పంపారు. పట్టాల పంపిణీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వగా, ఈ నెల 1న గోదావరిఖనిలో జరిగిన రామగుండం దశాబ్ది ప్రగతి సభలో తొలి విడుతగా ఈ రెండు గ్రామాల్లోని 600 మందికి మంత్రి కేటీఆర్ పట్టాలు పంపిణీ చేయగా, బాధితులు సంబురపడుతున్నారు. బీఆర్ఎస్ సర్కారు, మంత్రి కేటీఆర్‌కు, ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.



### పట్టా అత్తదని కలలగూడా అనుకోలె..



మాది పెద్దంపేట. ఇంటి పట్టాల కోసం తాత ముత్తాతల సంది తిరుగుతున్నం. లోన్ కోసం బ్యాంకులకు పోతె ఖురూజ్‌కమ్మి భూములని పక్కకు పెడ్తన్రు. ఎన్నోసార్లు ఎందరికో దరఖాస్తులిచ్చినం.. దండం పెట్టినం.. కానీ, ఎవ్వలూ పట్టించుకోలె. ఇగ అందరం సాలిచ్చుకున్నం. పట్టాలు రావు.. గింతే అనుకున్నం. కానీ, కేటీఆర్ సార్ దేవుడోలె అచ్చిండు. ఖురూజ్‌కమ్మి భూములకు పట్టాలిచ్చిండు. కలలో గూడా అత్తయనుకోలె.. మా కల నెరవేరింది. తండ్రీకొడుకులు సల్లంగుండాలె.. వాళ్లే మళ్లీ రావాలె.

**- పల్లెర్ల రజిత, పెద్దంపేట (అంతర్గాం)**

### మా బాధ ఏ సర్కారు పట్టించుకోలె..



ఖురూజ్ కమ్మి భూమిలో ఇండ్లు కట్టుకొని ఉంటున్నం. స్వాతంత్ర్యం అచ్చినప్పటి సంది ఈ భూములకు పట్టాలు లేవు.. ఊరోళ్లందరం ఎన్నోసార్లు కొట్లాడినం. వేరే కాడ ఇల్లు కట్టుకుంటం అంటే బ్యాంకుల లోను తీసుకుందామని పోతె మీ భూములకు పట్టాలు లెవ్వు.. లోన్లు ఎట్ల ఇచ్చుడు అనేటోళ్లు. కానీ, సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సార్లకు గిట్ల చెప్పంగనే ఎంటనే పట్టాలు మంజూరు జేసిన్రు. ఇంతజేసిన సీఎం కేసీఆర్ రుణం మేం తీర్చుకుంటం. అచ్చే ఎన్నికల్లో కారు గుర్తుకు గంపగుత్తగా 600 కుటుంబాలోళ్లం ఓటేత్తం.

**- బుసుపాక శీలమ్మ, పెద్దంపేట (అంతర్గాం)**

### కేసీఆర్ సారు రుణం తీర్చుకుంటం..



మా ఖురూజ్ కమ్మి భూములకు పట్టాలిచ్చిన సీఎం కేసీఆర్ సారుకు అచ్చే ఎన్నికల్లో ఓటేసి రుణం తీర్చుకుంటం. అసలు ఈ భూములకు హక్కు పత్రాలు ఇత్తరని కలలో గూడ అనుకోలె. ఎందుకంటే 60 యేండ్ల సంది ఎటు తెగుతలేదు. ఏ సర్కారు పట్టించుకోలేదు. కాంగ్రెస్సోళ్లయితే మమ్ములను లెక్కచేయలేదు. తెలంగాణ అచ్చినంక సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లు ఖురూజ్ కమ్మి భూములకు పట్టాలిచ్చి దేవుళ్లు అయ్యిన్రు. కారు గుర్తుకే బతికినంత కాలం ఓటేత్తం.

**- మూడెతల రాజయ్య, జవహర్ నగర్ (గోదావరిఖని)**